

యోగాసనం వేస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జేసీ అదితి సింగ్, కమిషనర్ మనోజ్‌రెడ్డి తదితరులు

యోగాతో.. ఆరోగ్యయోగం

● దినచర్యలో యోగా భాగం కావాలి : కలెక్టర్

కడప ఎన్టీఆర్ సర్కిల్, మే21 (ఆంధ్రజ్యోతి): యోగాతో ఆరోగ్య యోగం సిద్ధిస్తుందని, దినచర్యలో యోగా భాగం కావాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. జూన్ 21న 11వ అంతర్జాతీయ యోగాదినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కడప ఇండోర్ స్టేడియంలో ముందస్తు యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కలెక్టర్‌తో పాటు ఎస్పీ అశోక్‌కుమార్, జేసీ అదితిసింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మే 21 నుంచి జూన్ 21 వరకు యోగాంధ్ర 2025 క్యాంపెయిన్‌ను నిర్వహిస్తామన్నారు. దీనికోసం ఒక యాప్ రూపొందించామని ఇందులో అందరూ రిజిస్టరు కావచ్చన్నారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాసనాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. యోగాసనాలు వేయడం ద్వారా క్రమశిక్షణ, మెరుగైన జీవన విధానం అలవడుతాయన్నారు. జేసీ మాట్లాడుతూ ఉరుకులు పరుగుల జీవనంలో చదువులు, ఇళ్లల్లో పనులు, ఆఫీసుల్లో వత్తిళ్ల కారణంగా అనేక శారీరక, మానసిక ఆరోగ్య రుగ్మతలను ఎదుర్కొంటున్నారన్నారు. వీటిని అధిగమించేందుకు వ్యాయామం, యోగా ధ్యానం కోసం సమయం కేటాయించాలన్నారు. అనంతరం కలెక్టర్‌తో పాటు ఎస్పీ, జేసీ వివిధ శాఖల అధికారులు యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్‌రెడ్డి, డీపీవో రాజ్యలక్ష్మి, డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు, జడ్పీ సీఈవో ఓబులమ్మ, జిల్లా అధికారులు, ఆయుష్ సిబ్బంది పాల్గొన్నారు.

విస్తృత అవగాహన కల్పించాలి

యోగాంధ్ర-2025పై జిల్లాలో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి జిల్లాలో యోగాంధ్ర-2025 మాసోత్సవాల నిర్వహణపై అన్ని మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో జూన్ 15 వరకు యోగా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తామని, జూన్ 16 నుంచి 21 వరకు గుర్తించిన ప్రాంతాల్లో యోగా ప్రదర్శన ఉంటుందని అన్నారు. ప్రజలంతా నెలరోజులు జరిగే కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీసీఈవో ఓబులమ్మ, టూరిజం అధికారి సురేశ్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

త్రీఫేస్ విద్యుత్‌తో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి



విద్యుత్ అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ రమణ

కడప నాగరాజుపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభి వృది కి త్రీఫేస్ విద్యుత్ దోహద పడుతుందని జిల్లా విద్యుత్ శాఖ సూపరిం టెండెండింగ్ ఇంజనీర్ ఎస్.రమణ పేర్కొన్నారు. బుధవారం కడప విద్యుత్ భవన్‌లో త్రీఫేస్ విద్యుత్ ద్వారా రీవ్యాంప్‌డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం (ఆర్డీడీఎస్) కింద జరుగుతున్న పనులపై ఎస్ఈ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో పరిశ్రమల ఏర్పాటుకు మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా నిరంతర నాణ్యమైన త్రీఫేస్ విద్యుత్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. తద్వారా పట్టణాలకు దీటుగా గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని ఎస్ఈ తెలిపారు. ఆర్డీడీఎస్ పథకం కింద చేపట్టిన పనుల్లో వేగం పెంచాలన్నారు. ఈ పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. విద్యుత్ వ్యవస్థ పటిష్టంగా తయారయ్యేందుకు పనుల్లో వేగం పెంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ నాగరాజు, డీఈఈలు, ఏఈలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

అయ్యో..పాపం చిన్నారి... 6

మహా డిమాండ్..!

కడపలో టీడీపీ నిర్వహించనున్న మహానాడు సందర్భంగా రెండురోజుల పాటు దాదాపు 25వేల మందికి పైగా ఇక్కడే బస చేయనున్నారు. దీంతో లాడ్జీలు, హోటల్స్‌లో గదుల అద్దెను ఒక్కసారిగా పెంచేశారు. ఇప్పటికే గదులన్నీ రిజర్వ్ అయిపోయాయి. రానున్న అతిథులకు సరిపడా వసతుల ఏర్పాటుకోసం టీడీపీ నేతలు ప్రత్యామ్నాయ మార్గాలను వెదుకుతున్నారు. ఇక్కడి లాడ్జిల్లో ధరలను చూసి పలువురు నంద్యాల, ఆళ్లగడ్డలో రూములు బుక్ చేసుకుంటున్నారు.

● లాడ్జీలు, హోటల్స్‌లో గదుల అద్దెలు డబుల్
● రేట్లు చూసి నోరువెళ్లబెడుతున్న జనం
● మూడురోజుల పాటు నో రూమ్స్



(కడప-ఆంధ్రజ్యోతి): కడప గడపలో టీడీపీ తొలిసారిగా మహానాడు నిర్వహిస్తోంది. ఈ నెల 27, 28, 29 తేదీలలో నగర శివార్లలోని పబ్బాపురంలో మహానాడు జరగనుంది. ఈ మూడురోజుల కార్యక్రమానికి ఏపీ, తెలంగాణ నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు, అండమాన్ నికోబార్, విదేశాల నుంచి భారీ ఎత్తున తెలుగు తమ్ముళ్లు తరలిరానున్నారు. మూడురోజుల పాటు జరిగే మహానాడులో తొలి రెండురోజులు ప్రతినిధుల సభ నిర్వహిస్తారు. ఇప్పటికే 23వేల మందికి ఆహ్వానాలు పంపారు. చివరి రోజు ఐదు లక్షల మందితో బహిరంగసభ నిర్వహించాలని నిర్ణయించారు. చివరి రోజు బహిరంగ సభను మినహాయిస్తే తొలి రెండు రోజులు ప్రతినిధుల సభకు వచ్చే 23వేల మంది కార్యకర్తలకు బస కల్పించాల్సి ఉంది. వారితో పాటు మంత్రులు, వారి వెంట వచ్చే అనుచరులు కలిపి 25వేల దాకా ఉండచ్చని అంచనా. అయితే ఇంత స్థాయిలో వసతులు కల్పించేందుకు జిల్లాలో లాడ్జీలు, హోటల్స్ లేవు. అందుకే టీడీపీ నేతలు జిల్లాలో ఉన్న వీఐపీల కోసం గెస్ట్‌హౌస్‌లు, విల్లాస్, ప్రైవేటు ఫంక్షన్‌హాల్స్, ప్రైవేటు విద్యాసంస్థల హాస్టల్స్‌ను బస కోసం తీసుకున్నారు. అయినా ఇంకా సరిపోని పరిస్థితి నెలకొంది.



ధర పెంచేశారు

మహానాడు వేళ కడప, అన్నమయ్య జిల్లాల్లోని హోటల్స్‌కు ఎనలేని గిరాకీ ఏర్పడింది. మామూలుగా అయితే హోటల్స్‌లో గది తీసుకుంటే 24గంటలకు చార్జి చేస్తారు. సంక్రాంతి సమయంలో అయితే కోస్తాలో కోళ్లపందాలు ఎక్కువగా జరుగుతాయి. భీమవరంలో హోటల్స్‌కు డిమాండ్ ఉంటుంది. ఆ మూడురోజులు 24గంటలకు బదులు 12గంటల చొప్పున గదులకు చార్జ్ చేస్తారు. ఇప్పుడు మహానాడుతో ఒక్కసారిగా కడపలో హోటల్స్, లాడ్జీల్లో గదుల ధరలకు రెక్కలొచ్చాయి. ఉమ్మడి జిల్లాలో కడప, ప్రొద్దుటూరు, రాజంపేట, రాయచోటిలో ప్రధాన హోటల్స్ ఉన్నాయి. ఇక పోరుమామిళ్ల, బద్వేలు, మైదుకూరులోనూ ఓ మోస్తరు హోటల్స్ ఉన్నాయి. కడపలో 150, ప్రొద్దుటూరులో 150 గదులు, రాయచోటిలో సుమారు వంద గదులు అందుబాటులో ఉంటాయి. సాధారణ రోజుల్లో కడపలో సింగిల్ రూం రూ.1500 నుంచి రూ.2వేల మధ్య, డబుల్ రూం రూ.2వేల నుంచి రూ.2500 లోపు దొరికేది. సూట్ కూడా రూ.3వేల లోపు ఉండేది. అయితే మహానాడు నేపథ్యంలో అంతకు అంత రేట్లు పెంచేశారు. అంటే రూ.2,500 ఉన్నది ఐదారువేలు దాకా పెంచేశారు.

27, 28 తేదీలలో రెండురోజుల పాటు నిర్వహించే ప్రతినిధుల సభకు వచ్చే 25వేల మందికి వసతులు కల్పించేందుకు టీడీపీ నేతలు అందుబాటులో ఉన్నవన్నీ తీసుకుంటున్నారు. కడపలోని హోటల్స్, లాడ్జీల రూములన్నీ ఫుల్ అయిపోయాయి. టీడీపీ వాళ్లు ఏ హోటల్ వద్దకు వెళ్లినా ఆ రెండు రోజుల్లో ఖాళీ లేవంటూ సమాధానమిస్తున్నారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నారు, అన్నీ ఫుల్ అయ్యాయని చెబుతున్నారు. అదే వేరేవాళ్లు వెళితే రూ.6వేలు అని చెప్పి బేరమాడితే చివరకు రూ.5వేలకు ఇస్తుండడం గమనార్హం. ఫుల్ కాకపోయినా ఫుల్ అయినట్లు చెప్పేసి బయట వారికి రెంట్‌కు ఇస్తున్నారు. మహానాడు నిర్వహణతో కడప పేరు

● లాడ్జీలన్నీ ఫుల్.. వసతుల కోసం అవస్థలు

మారుమోగుతోంది. ఈ నేపథ్యంలో హోటల్స్‌లో గదుల ధర పెంచడం చూసి చెడ్డపేరు వస్తుందని, బయటి నుంచి రావాలంటే భయపడుతున్నారని టీడీపీ నేతలు వాపోతున్నారు. ఇక్కడ రేట్లను చూసి కొందరు ఆళ్లగడ్డ, నంద్యాల, కర్నూలు ప్రాంతాల్లో కూడా రూములు బుక్ చేశారు. ఇదంతా జాతీయ రహదారి కావడంతో 2 నుంచి 3గంటల్లోపు చేరుకోవచ్చని కొందరు బయట తీసుకుంటున్నారు. కడపలోని లాడ్జీల్లో ఇష్టారాజ్యంగా రేట్లను పెంచడం చూసి పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి మహానాడు వేళ హోటల్స్ డిమాండ్ చేసే ధర చూసి వామ్మో.. అనుకునే పరిస్థితి వచ్చింది.

మహానాడు పనులు ముమ్మరం

● కమ్యూనికేషన్‌కు నాలుగు సెల్‌ఫోన్ టవర్లు ఏర్పాటు
● ప్రతినిధులు, బహిరంగసభ వేదిక నేటితో పూర్తి
● నిర్విరామంగా సాగుతున్న పనులు

(కడప-ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రతిష్టాత్మకంగా ఈనెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించనున్న మహానాడుకు సంబంధించి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వర్షం వల్ల పనులకు అడ్డంకులు వస్తున్నప్పటికీ వేగంగా వేదికను సిద్ధం చేస్తున్నారు. వేదిక ఏర్పాట్లకు సంబంధించి ఎమ్మెల్సీలు రాంగోపాల్‌రెడ్డి, బీద రవిచంద్ర, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, మాజీ ఎమ్మెల్సీ సత్యం రాజు, ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి , జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు. బుధవారం సాయంత్రం నాటికి పనులు కీలక దశకు చేరుకున్నాయి. మహానాడులో తొలి రెండు రోజులు 23వేల మందితో ప్రతినిధుల సభ జరగనుంది. దీనికి సంబంధించి వేదిక దాదాపు పూర్తి కావచ్చింది. వర్షం వచ్చినా సరే తడవకుండా ఉండేందుకు కొత్త టెక్నాలజీతో ప్రధాన వేదికను, గ్యాలరీలు సిద్ధం చేస్తున్నారు. ఇక 29వ తేదీన జరిగే బహిరంగ సమావేశానికి వేదిక దాదాపు పూర్తికావచ్చింది.

బహిరంగసభకు దాదాపు 50వేలకు పైగా వాహ నాలు వస్తాయని అంచనా వేస్తు న్నారు. వీటికి సంబంధించి రాయ చోటి, పులివెందుల రోడ్డులోని ఖాళీ ప్రదేశాల్లో పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ఆ ప్రదేశంలోని చెట్లు, ముళ్లపొదలు తొలగించి వాహ నాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేస్తు న్నారు. రెండురోజుల్లో పార్కింగ్ అందుబాటులోకి వస్తుంది. ఇప్ప టికే కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్పీ అశోక్‌కుమార్, జేసీ అదితి సింగ్‌లు పార్కింగ్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. ట్రాఫిక్ సమస్య లేకుండా పార్కింగ్ స్థలాలు కేటాయించారు. బహిరంగసభకు ఐదులక్షల మంది జనం హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో కమ్యూనికేషన్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఎయిర్‌టెల్, జియో, బీఎస్ఎన్ఎల్‌కు సంబంధించి నాలుగు మొబైల్ టవర్లను ఏర్పాటుచేశారు. ఇక బ్రాడ్‌బాండ్ కనెక్షన్ కోసం ఫైబర్‌నెట్ కూడా తీసుకున్నారు. కడపను మహానాడు రోజున పసు పుమయం చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా రింగురోడ్డులోని సర్కిళ్లన్నీ పసుపు మయంగా మారుస్తున్నారు. మహానాడు ఏర్పాట్లను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, హరిప్రసాద్, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఇతర టీడీపీ నేతలు బుధవారం పరిశీలించారు.

చురుగ్గా సాగుతున్న మహానాడు పనులు





మహానాడు ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, టీడీపీ రాష్ట ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు తదితరులు



ఊటుకూరు రింగ్ రోడ్డు దగ్గర ఏర్పాటు చేసిన కటౌట్

భద్రతా ఏర్పాట్లు పరిశీలించిన డీఐజీ

కడప క్రైం, మే 21 (ఆంధ్రజ్యోతి): సీకేదిన్నె మండలం పబ్బాపురంలో మహానాడు జరగనున్న నేపథ్యంలో కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ బుధవారం భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు. ఆయన వెంట ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్, అన్నమయ్య జిల్లా విద్యాసాగర్‌నాయుడు, నంద్యాల ఎస్పీ ఆదిరాజ్‌సింగ్ రాణా ఉన్నారు. మహానాడుకు సంబంధించి పార్కింగ్ ప్రదేశాలు, ప్రధానవేదిక, ఫుడ్‌కోర్టుల వద్ద చేపట్టాల్సిన బందోబస్తు ఏర్పాట్లపై పోలీసు అధికారులకు డీఐజీ దిశ నిర్దేశం చేశారు.

మొక్కు బడిగా..

● 33 మంది జడ్పీటీసీ సభ్యులు గైర్హాజరు
● హాజరుకాని మహిళా, సాంఘిక సంక్షేమ కమిటీల అధ్యక్షులు
● ఇదీ జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం తీరు

కడప రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సారథ్యంలోని జడ్పీ పాలకమండలి కొలువుదీరి నాలుగేళ్లు అవుతోంది. అప్పటి నుంచీ స్టాండింగ్ కమిటీ సమావేశాలను గాలికి వదిలేసింది. ప్రభుత్వశాఖలపై చర్చించి ప్రజలకు ఉపయోగపడే రీతిలో అభివృద్ధి పనులకు దిశ నిర్దేశం చేయాల్సిన జడ్పీటీసీ సభ్యులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం నిర్వహించిన స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని ఎప్పటిలాగానే మొక్కుబడిగా నిర్వహించారు. ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలో మొత్తం 48 మంది జడ్పీటీలు ఉండగా 15 మంది మాంది మాత్రమే హాజరయ్యారు. కో-ఆప్షన్ సభ్యులతో కలిపి మొత్తం 50 మంది సభ్యులలో 33 మంది సమావేశవానికి రాలేదు. మహిళా సంక్షేమము, సాంఘిక సంక్షేమ కమిటీల అధ్యక్షులు జె.శారద, సి.పుష్పలత హాజరుకాలేదు.

రెండుమూడు కలిపి ఒకేసారి..

జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలను ఒక్కొక్కటి కాకుండా రెండు, మూడు సంఘాలను కలిపి ఒకేసారి నిర్వహించారు. ఒక్కొక్క స్థాయి సంఘానికి 6 నుంచి 8 మంది జడ్పీటీసీ సభ్యులతో పాటు 7 నుంచి 17 వరకు ప్రభుత్వశాఖలు ఉంటాయి. ఇలా మొత్తం 7 స్థాయి సంఘాలు ఉన్నాయి. ఈ మేరకు విడివిడిగా ఒక్కొక్క స్థాయి సంఘంతో సమావేశం నిర్వహించి దాని పరిధిలోని శాఖలపై చర్చించి ప్రజా సమస్యలకు పరిష్కారం చూపాలి. కానీ రెండు, మూడు సమావేశాలను కలిపి ఒకేసారి మొక్కుబడిగా నిర్వహించి ముగించేశారు.

సమస్యలపై అరకొరగా చర్చ

ఉదయం 10 గంటలకు ప్రారంభించాల్సిన జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని ఎప్పటిలాగానే దాదాపు గంట ఆలస్యంగా ప్రారంభించి 12-20కి ముగించేశారు. జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలలో ప్రజాసమస్యలపై అరకొరగా చర్చసాగించారు. ప్రణాళిక, ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యసేవలు, పనుల స్థాయి సంఘ సమావేశాలలో జడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి మాట్లాడుతూ మైదుకూరు నియోజకవర్గ పరధిలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న 60 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను తప్పులు చేశారని తొలగించడం దారుణమన్నారు. వారు తప్పు చేశారని భావిస్తే పైఅధికారులు కూడా బాధ్యులేనని, వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. రాజంపేట ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం జడ్పీ నిధులతో మరుగుదొడ్లను నిర్మిస్తామన్నారు. రహదారులలో స్పీడ్ బ్రేకర్ల తొలగింపు ప్రస్తావనపై అధికారి మాట్లాడుతుండగా రూల్స్ తనకు తెలుసని తాను కూడా కాంట్రాక్టర్నేనని రూ.1000 కోట్లు పనులు చేస్తున్నానని రామగోవింద్‌రెడ్డి గట్టిగా వినిపించారు. కమలాపురం జడ్పీటీసీ సభ్యురాలు, లింగాల సుమిత్ర, ఖాజీపేట కో-ఆప్షన్ సభ్యులు కరీముల్లా మాట్లాడుతూ పీహెచ్‌సీలలో మౌలిక వసతులను కల్పించాలన్నారు. పోరుమామిళ్ల జడ్పీటీసీ ముత్యాల చెన్నయ్య, బి.కోడూరు జడ్పీటీసీ దావీద్ మాట్లాడుతూ కొత్త పింఛన్లు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. వ్యవసాయశాఖ చర్చలో భాగంగా వైస్ చైర్మన్ పిట్టు బాలయ్య యాదవ్ మాట్లాడుతూ మరో నెల రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాబోతుందని రైతులకు అవసరమైన నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. గత ఖరీఫ్, రబీల్లో నాసి రకం విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు విక్రయించడంతో రైతులు చాలా నష్టపోయారని ఈసారి అలాంటి వాటికి తావులేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ, డిప్యూటీ సీఈవో మైథిలి, ఉమ్మడి కడప జిల్లాలోని ఆయా శాఖల అధికారులు, జడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



జడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్న విద్య, వైద్యసేవల స్థాయి సంఘ సమావేశం

ఈత... తస్మాత్ జాగ్రత్త
● అప్రమత్తంగా లేకపోతే మృత్యువాత
● విషాదంగా మారుతున్న ఈత సరదా 7

మోడల్ స్కూల్ విద్యార్థికి షైనింగ్ స్టార్ అవార్డు 7

ఆ అతిథి గృహానికి 154 ఏళ్లు 6

ఐటీఐలో శిక్షణ...ఉపాధికి నిచ్చెన

- విద్యార్థుల నైపుణ్యానికి పెద్దపీట
- కోర్సులు పూర్తి కాగానే ఉద్యోగావకాశాలు
- ఈనెల 24 వరకే దరఖాస్తుకు గడువు



తంబళ్లపల్లెలోని టీఎన్‌వీఎస్‌ఆర్ఎం ప్రభుత్వ ఐటీఐ



తంబళ్లపల్లె ఐటీఐలో ఫిట్టర్ ట్రేడ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

తంబళ్లపల్లె, మే 21 (ఆంధ్రజ్యోతి): యువతలో తక్కువ సమయంలోనే నైపుణ్యాలు పెంపొందించి త్వరగా ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఐటీఐ (పారిశ్రామిక శిక్షణా సంస్థ)లు ఎంతగానో దోహదపడుతున్నాయి. యువతకు తక్కువ కాల వ్యవధిలో వివిధ ట్రేడ్లలో శిక్షణ ఇచ్చి వారి భవిష్యత్తుకు సోపానమార్గాలుగా మారుతున్నాయి. ఐటీఐ ట్రేడ్‌లలో ఏ కోర్సు పూర్తి చేసినా ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ప్రధానంగా రైల్వే, రక్షణ, ఆర్మీ, ఆర్టీసీ, విద్యుత్ వంటి ప్రభుత్వ, ఇతర ప్రైవేటు రంగ సంస్థల్లో ఉద్యోగావకాశాలు పొందడానికి అవకాశం ఉంటుంది. పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పనలో ఐటీఐ పూర్తి చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుంది. ఇక స్వయంగా ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

ఐటీఐతో మంచి ఉపాధి అవకాశాలు



తక్కువ కాల వ్యవధి చదువుతో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్న కోర్సు ఐటీఐ. ఐటీఐ కోర్సులు పూర్తి చేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల్లో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఐటీఐ పూర్తి చేసిన వారిలో 90 శాతం మంది ఉపాధి పొందుతున్నారు. ఐటీఐ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ఉపాధి కల్పించడంలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. పదో తరగతి పూర్తి చేసిన వారు ఐటీఐలో చేరడానికి దరఖాస్తు చేసుకోవచ్చు.

- శ్రీనివాసులరెడ్డి, ప్రిన్సిపాల్, తంబళ్లపల్లె ఐటీఐ

జిల్లాలో ఐటీఐ కాలేజీలు ఇలా..

జిల్లాలో మొత్తం 15 ఐటీఐలు ఉండగా అందులో 3 ప్రభుత్వ, 12 ప్రైవేటు ఐటీఐలు ఉన్నాయి. తంబళ్లపల్లె, రాజంపేట, పీలేరుల్లో ఒక్కొక్క ప్రభుత్వ ఐటీఐలు ఉండగా మదనపల్లెలో నాలుగు, రాయచోటిలో రెండు, ములకలచెరువు, రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు, గుర్రంకొండ, వాల్మీకిపురంలో ఒక్కో ప్రైవేటు ఐటీఐ ఉంది. జిల్లాలో మూడు ప్రభుత్వ ఐటీఐలలో కలిపి 392 సీట్లు, 12 ప్రైవేటు ఐటీఐలలో 1064 సీట్లు ఖాళీలున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో ఏడాది, రెండు సంవత్సరాలకు సంబంధించిన కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఇందులో రెండు సంవత్సరాలకు సంబంధించి ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, మోటార్ వెహికల్ మెకానిక్ కోర్సులు ఉన్నాయి. ఏడాదికి సంబంధించి కంప్యూటర్ కోర్సు, డీజిల్ మెకానిక్, వెల్డర్, వైర్‌మెన్ కోర్సులు ఉన్నాయి.

24 వరకు దరఖాస్తుకు అవకాశం

ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2025-26 సంవత్సరంలో ప్రవేశాలకు మొదటి విడతలో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. పదోతరగతి తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. అర్హులైన, ఆసక్తి గల విద్యార్థులు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైటులో ఈనెల 24వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలి. లేదా దగ్గరలోని ఐటీఐలో కూడా నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న వారు తప్పనిసరిగా ఏదైనా ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ వద్ద తమ ఒరిజినల్ విద్యార్హత సర్టిఫికెట్లు తీసుకువెళ్లి ఈనెల 26వ తేదీలోగా వెరిఫికేషన్ చేయించుకోవాలి. వెరిఫికేషన్ చేసుకోని పక్షంలో దరఖాస్తులు ఆమోదించబడవు.

మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా సీట్లు

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న వారికి పదో తరగతిలో వచ్చిన మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రక్రియ ఆధారంగా సీటును కేటాయిస్తారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు వచ్చిన వారికి ట్రేడు ఎంపికలో ప్రాధాన్యం ఉంటుంది. పదిలో సమానమైన మార్కులు వచ్చినపుడు గణితంలో మార్కులు ఎక్కువ వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తారు. గణితంలో కూడా సమానమైన మార్కులు వచ్చి ఉంటే సైన్స్‌లో ఎక్కువ మార్కులు వచ్చిన వారికి, గణితం, సైన్స్ రెండింటిలోనూ సమానమైన మార్కులు వచ్చినపుడు పుట్టిన తేదీని, రిజర్వేషన్ కేటగిరీని పరిగణలోకి తీసుకుని సీటు కేటాయిస్తారు.


ఉన్నత విద్యకు అవకాశం

ఐటీఐలో రెండేళ్ల కోర్సు పూర్తి చేసుకుని ఉన్నత విద్య చదవాలకునే వాళ్లు పాలిటెక్నిక్ డిప్లమా కోర్సులో చేరడానికి తొలి ప్రాధాన్యం ఇవ్వవచ్చు. ఐటీఐ పూర్తి చేసి బ్రిడ్జి కోర్సు ద్వారా నేరుగా పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరం కోర్సుల్లో చేరే అవకాశం ఉంటుంది. డిప్లమా అనంతరం ఆసక్తి ఉంటే బీటెక్, బీఈ కోర్సులు చేయవచ్చు.

ప్రభుత్వ ఐటీఐల్లో ప్రతి నెలా జాబ్‌మేళా

ఐటీఐ శిక్షణ పూర్తి చేసుకున్న నిరుద్యోగ యువతీ యువకులకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి నెల ప్రభుత్వ ఐటీఐల్లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. ఐటీఐతో పాటు పది, ఇంటర్, డిగ్రీ చదివిన విద్యార్థులు కూడా ఈ మేళాకు హాజరు కావచ్చు. ఈ జాబ్‌మేళాకు ఏపీ, ఉమ్మడి అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాలోని ప్రముఖ కంపెనీలతో పాటు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ నుంచి పలు కంపెనీల ప్రతినిధులు హాజరై నైపుణ్యం, విద్యార్హత ఆధారంగా ఉద్యోగానికి ఎంపిక చేసుకుంటున్నారు.

24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి



ఐటీఐలో చేరదలిచే విద్యార్థులు మే 24వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఐటీఐలో నేరుగా కూడా అందించవచ్చు. దరఖాస్తు చేసుకున్న వారు 26వ తేదీలోగా సమీప ఐటీఐ వద్దకు వెళ్లి విధిగా విద్యార్హత ధ్రువపత్రాలను వెరిఫికేషన్ చేయించుకోవాలి. కౌన్సిలింగ్ తేదీ వివరాలను విద్యార్థుల మొబైల్ నెంబరుకు పంపిస్తాం. పదో తరగతి మార్కులు, రిజర్వేషన్ ఆదారంగా సీట్ల కేటాయింపు జరుగుతుంది.

- నాగరాజు టీవో, తంబళ్లపల్లె ఐటీఐ.

యోగాతో ఆరోగ్యం

సబ్ కలెక్టర్ మేఘస్వరూప్



సూర్యనమస్కారాలు చేస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): యోగాతో ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం సిద్ధిస్తుందని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రైవేటు ఫంక్షన్ హాల్లో సబ్‌కలెక్టర్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా అనేది ఆరోగ్యానికి పునాది అవుతోందన్నారు. యోగా, ప్రాణాయామం, ఆసనాలు, గురించి ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, తహసీల్దార్, యోగా శిక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండు తనిఖీ

స్థానిక ఆర్టీసీ బస్టాండు ప్రాంగణం మౌలిక వసతులపై ఫిర్యాదులు రావడంతో సబ్‌కలెక్టర్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరుగుదొడ్లు నిర్వహించడం లేదని, తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు, నీటి నాణ్యతపై 15 రోజులకు ఒకసారి పరీక్షలు చేయాలన్నారు. అద్దె బస్సులను బస్టాండు ప్రాంగణంలో అడ్డదిడ్డంగా నిలిచి ఉంచడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్లు అమరనాథ్, రమణ, రేవతి, గీతా, ఆర్అండ్‌బీ ఈఈ అరవింద, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రెడ్డెప్ప, కమిషనర్ ప్రమీల పాల్గొన్నారు.

దళితులపై దాడులు కనిపించలేదా?

కళ్లకు గంతలతో నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న పీటీఎం శివప్రసాద్, తదితరులు

మదనపల్లె, మే 21 (ఆంధ్రజ్యోతి): దళితులపై దమనకాండ ఈ ప్రభుత్వానికి కనిపించలేదా అని అని వీసీకే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ ప్రశ్నించారు. దళితులపై దాడులను ఖండిస్తూ, బుధవారం బాస్ కార్యాలయంలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోని మల్లాంలో నెల రోజులుగా దళితుల సాంఘిక బహిష్కరణ కొనసాగుతున్నా, ఇప్పటికీ పవన్‌కల్యాణ్ స్పందించకపోవడం కుల వివక్షకు సంకేతం కాదా?అని ప్రశ్నించారు. విశాఖపట్నంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఎత్తుకెళ్లిపోవడంతో ఇప్పటికీ రిలే దీక్షలు కొనసాగుతున్నాయన్నారు. ప్రకాశం జిల్లాలో అంబేడ్కర్ జయంతి ఊరేగింపును ఆధిపత్య కులాల వాళ్లు అడ్డుకున్నట్లు తెలిపారు. మోహన్‌బాబుకు చెందిన యూనివర్సిటీలో బీటెక్ చదువుతున్న విద్యార్థి జేమ్స్‌ను కిడ్నాప్ చేసి తీసుకెళ్లి తిరుపతిలోని ఓ లాడ్జిలో ఒకటిన్నర రోజు చిత్రహింసలు పెట్టి ముఖంపై మూత్రం పోశారని ఆరోపించారు. ఇలాంటి సంఘటనలు ఎన్నో జరుగుతున్నా ప్రభుత్వం ఒక్క సంఘటన మీద కూడా స్పందించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో బాస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చాట్ల బయన్న, పెద్దపాళెం రవిశంకర్, బురుజు రెడ్డిప్రసాద్, గంపల రమణ, వై.గంగాధర్, జి.బాబు, జి.గంగాదర్, తదితరులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ అసిస్టెంట్ సస్పెన్షన్

మదనపల్లె టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం కోళ్లబైలు-1 పంచాయతీ గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ శ్రీధర్ చామకూరి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కోళ్లబైలు-1 గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న డి.ద్వారకనాథనాయుడు గతంలో వాల్మీకిపురం మండలం కూరపర్తి గ్రామ సచివాలయంలో విధులు నిర్వహించేటప్పుడు అదే గ్రామానికి చెందిన రెడ్డెప్ప, హరీష్ అనే ఇద్దరి వద్ద పీఎం యోజన పథకం మంజూరు చేయిస్తానని వారి వద్ద రూ.49 వేలను ఫోన్‌పేలో లంచంగా తీసుకున్నాడు. ఈ విషయాన్ని ఏప్రిల్ 28న పీజీఆర్ఎస్‌లో బాధితులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించి నివేదిక ఇవ్వాలని మదనపల్లె ఎంపీడీవోను కలెక్టర్ ఆదేశించారు. ఎంపీడీవో పరిశీలించిన కలెక్టర్ వెల్ఫేర్ అసిస్టెంట్ ద్వారకనాథనాయుడును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ముందస్తు అనుమతి లేకుండా ద్వారకనాథనాయుడు గ్రామాన్ని విడిచి వెళ్లరాదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అయ్యో..పాపం చిన్నారి...

- రోడ్డు ప్రమాదంలో తల్లి మృతి
- తల్లి కోసం తల్లడిల్లుతున్న ఆరు నెలల చిన్నారి



సంఘటనా స్థలంలోనే మృతి చెందిన అమ్మాజాన్

ములకలచెరువు, మే 21 (ఆంధ్రజ్యోతి): ముంబాయి-చెన్నై జాతీయ రహదారిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. భర్తతో పాటు ఆరు నెలల చిన్నారికి గాయాలయ్యాయి. దీంతో తల్లి కోసం చిన్నారి ఏడుస్తున్న తీరు చూసిన వారు కంటతడిపెట్టారు. పోలీసుల కథనం మేరకు...మండలంలోని దేవళచెరువుకు చెందిన షామీర్‌బాషా కుమారుడు సమీవుల్లా ఆటోడ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతనికి భార్య అమ్మాజాన్, ఆరు నెలల కుమార్తె సాఫియా ఉన్నారు. వారు ముగ్గురు బుధవారం ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా వేపూరికోట క్రాస్‌లో ద్విచక్రవాహనాన్ని టమోటాలు తీసుకెళ్తున్న ఐచర్ వాహనం వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదంలో అమ్మాజాన్ రోడ్డుపై, భర్త సమీవుల్లా, కుమార్తె సాఫియాలు కొంతదూరంలో ఎగిరిపడ్డారు. రోడ్డుపై పడ్డ అమ్మాజన్ (22) తలపై ఐచర్ వాహనం ఎక్కించడంతో అక్కడికక్కడే మృతి చెందింది.

అలాగే భర్త, ఆరు నెలల కుమార్తె తీవ్రంగా గాయపడ్డారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఐచర్ వాహనం వేగంగా వెనుక వైపు నుంచి వచ్చి ఢీకొనడంతో ప్రమాదం జరిగిందని గ్రామస్థులు తెలిపారు. మృతి చెందిన మహిళ స్వగ్రామం పెద్దతిప్పసముద్రం మండలం కందుకూరు గ్రామం. ఆమె మృతితో కందుకూరుతో పాటు దేవళచెరువులో విషాదఛాయలు అలుముకున్నాయి.

తల్లి కోసం బిడ్డ ఆరాటం... కంట తడి పెట్టించిన ఘటన



ములకలచెరువులోని వేపూరికోటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దేవళచెరువు గ్రామానికి చెందిన అమ్మాజాన్ మృతి చెందడం... భర్త, ఆరు నెలల కుమార్తెకు తీవ్రగాయాలైన ఘటన కంట తడి పెట్టించింది. తల్లి కోసం ఆరు నెలల కుమార్తె తల్లడిల్లింది. చనిపోయిన తల్లి వైపు చూసి చిన్నారి భోరున విలపించింది. పాపం తల్లి మృతి చెందిందని కూడా తెలియని వయస్సులో ఉన్న చిన్నారి అమె దగ్గరకు వెళ్లాలని రోదిస్తుండటం చూసిన వారిని కంటతడి పెట్టించింది. గ్రామస్థులు చిన్నారిని ఎత్తుకుని ఎంత సముదాయించినా ఏడుపు ఆపలేదు. తల్లిని చూస్తూ ఏడుస్తున్న చిన్నారిని చూసి అయ్యో...పాపమంటూ కంటనీరు పెట్టుకున్నారు.

ఘనంగా తిరంగా ర్యాలీ



నందలూరులో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నందలూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) :ఆపరేషన్ సిందూర్ ఘనవిజయానికి మద్దతుగా బుధవారం సాయంత్రం ఎన్డీయే కూటమి ఆధ్వర్యంలో చేపట్టిన తిరంగా యాత్ర ర్యాలీకి విశేష స్పందన లభించింది. ఈ ర్యాలీ నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లెలోని శ్రీకృష్ణ గీతా మందిరం నుంచి నందలూరు సౌమ్యనాథస్వామి ఆలయం వరకు కొనసాగింది. ర్యాలీలో 100 అడుగులతో జాతీయ జెండాను ఊరేగించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు జంగంశెట్టి సుబ్బ య్య, జంబు సూర్యనారాయణ, హిమగిరినాధ్‌యాదవ్, మోడపోతుల రాము, పసుపులేటి ప్రవీణ్, చామంచి పెంచలయ్య, గంధం గంగాధర్, కొట్టే శ్రీహరి, సయ్యద్ అమీర్, ఉప్పుశెట్టి సుధీర్, పాటూరు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు లక్కిరెడ్డిపల్లెలో... : లక్కిరెడ్డిపల్లెలో గురువారం తిరంగ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల యువజన నాయకుడు యనమల మదన్‌మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు.

ఆ అతిథి గృహానికి 154 ఏళ్లు

- హార్సిలీహిల్స్‌కు తలమానికం..
- మధురానుభూతులు మిగిల్చే ప్రదేశం

బి.కొత్తకోట, మే 21 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలం పరిధిలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌కు అటవీశాఖ ప్రాంగణంలో ఉన్న చారిత్రాత్మక అతిథిగృహం తలమానికంగా నిలుస్తోంది. ఒకటిన్నర శతాబ్దం క్రితం ఏనుగుమల్లమ్మ కొండగా పిలువబడే కొండపై ప్రత్యేక శ్రద్ధ కనబరచి మౌలిక సదుపాయాలు కల్పించి, తరతరాలు నిలిచిపోయే నిర్మాణాలను భావితరానికి అందించారు డబ్ల్యు హెచ్ హార్సిలీ అనే బ్రిటిష్ అధికారి. అందులో అటవీశాఖ సముదాయంలో 1871లో నిర్మించబడిన పురాతన అతిథిగృహం ఒకటి. అప్పటికే ముందస్తు ప్రణాళికతో, చెక్కుచెదరని సాంకేతికతతో విశాలమైన గదులు నిర్మించారు. బ్రిటిష్ అధికారులు మొదలుకొని నేటి వరకు 154 ఏళ్లుగా ఈ అతిథిగృహం సేవలను అందిస్తోంది. ఇటీవల సెక్షన్ ఆఫీసర్ శివకుమార్ ఉన్నతాధికారుల సహకారంతో దానికి మెరుగులు దిద్దారు. దీంతో లోపలి భాగం అందంగా తయారవ్వడంతో పాటు, రాత్రిళ్లు ఈ కట్టడం మరింత సుందరంగా కనిపిస్తూ పర్యాటకులను కట్టిపడేస్తోంది. సముద్రమట్టానికి 4312 అడుగుల ఎత్తులో ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపి సేదతీరడానికి వచ్చే పర్యాటకులకు ఈ అతిథిగృహం, దీని ముందున్న విశాల ప్రాంగణం మధురానుభూతుల్ని మిగుల్చుతుంది. చల్లనిగాలులు, ప్రశాంతమైన నిశ్శబ్ద వాతావరణంలో అటవీశాఖ అతిథిగృహం ముందు ఎలా ఉంటుందన్నది స్వయంగా అనుభవిస్తే తప్ప, మాటల్లో వర్ణించలేని అనుభవంగా పర్యాటకులు పేర్కొంటుంటారు.



హార్సిలీహిల్స్‌లోని అటవీశాఖ అతిథిగృహం



అతిథి గృహం ఎదుట అటవీ శాఖ ఏర్పాటు చేసిన బోర్డు

ముత్తూట్ ఫైనాన్స్ స్కాంలో ముగ్గురి అరెస్ట్

బి.కొత్తకోట, మే 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రంగసముద్రం రోడ్డులో ఉన్న ముత్తూట్ ఫైనాన్స్‌లో నగదు స్వాహా చేసిన ముగ్గురిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్లు ములకలచెరువు సీఐ లక్ష్మన్న తెలిపారు. ఈ సంస్థలో బంగారు నగలు తనఖా పెట్టి రుణాలు తీసుకున్నవారు చెల్లించిన రూ.66 లక్షలను వారి ఖాతాల్లో జమ చేయకుండా సొంత అవసరాలకు వాడుకున్నారు. ఈ వ్యవహారంపై అంతర్గత విచారణ చేసిన ముత్తూట్ యాజమాన్యం అప్పటి మేనేజర్, మరో ఇద్దరు ఉద్యోగులపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణ చేసిన అనంతరంమదనపల్లి మండలం పెంచుపాడుకు చెందిన దూదేకుల ఇమ్రాన్‌బాషా(30), పీటీయం మండలం మల్లెలకు చెందిన జరిపిటి హరీష్(29), గుమ్మసముద్రం పంచాయతీ బావగారిపల్లెకు చెందిన యం.హరికృష్ణ (26) ను హార్సిలీహిల్స్ క్రాస్‌వద్ద అదుపులోకి తీసుకొని రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

మినీ లారీ, కారు ఢీ

ముగ్గురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో బోల్తా పడిన మినీ లారీ, దెబ్బతిన్న కారు

కురబలకోట, మే 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు మదనపల్లె రూరల్ ఎస్ఐ గాయత్రి బుధవారం మధ్యాహ్నం తంబళ్లపల్లె నుంచి మదనపల్లెకు వెళుతుండగా ముదివేడు క్రాస్ వద్ద మదనపల్లె నుంచి కడపవైపు టమోటాలను తీసుకువెళుతున్న మినీ లారీ కారును ఢీకొని బోల్తా పడింది. దీంతో బస్సు కోసం రోడ్డు పక్కన నిలుచున్న ములకలచెరువు మండలం చౌటకుంటపల్లెకు చెందిన రెడ్డెమ్మ(50), సత్యసాయి జిల్లా తనకల్లు మండలం నారేవాండ్లపల్లెకు చెందిన అరుణమ్మ(56), కలకడ మండలం పాపిరెడ్డిగారిపల్లెకు చెందిన వెంకట్రమణ గాయపడ్డారు. క్షతగాత్రులను 108 సాయంతో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు

కేంద్రీయ విద్యాలయానికి స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న సాయిలోకేశ్, అధికారులు

రాజంపేట, మే 21 (ఆంధ్రజ్యోతి) : అధికారుల బృందం బుధవారం కేంద్రీయ విద్యాలయ స్థల పరిశీలన చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయి లోకేశ్ ఇటీవల కేంద్రీయ విద్యాలయ కమిషనర్ నిధిపాండేను కేంద్రియ విద్యాలయానికి శాశ్వత భవనం కోసం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరితో పాటు కలిశారు. అందుకు స్పందించిన వారు బుధవారం అధికారుల బృందాన్ని పంపారు. ఈ సందర్భంగా రాజంపేటలో కేంద్రీయ విద్యాలయ డిప్యూటీ కమిషనర్ మంజునాథ్, అసిస్టెంట్ కమిషనర్ అనురాధా, ప్రధానోపాధ్యాయుడు సబ్‌కలెక్టర్ వైఖోం నిదియాదేవిని కలిసి స్థల పరిశీలన కోసం చర్చించారు. అనంతరం తహసీల్దారు పీర్‌మున్నీ, ఆర్ఐ కుమారస్వామి, సర్వేయర్ భవాని, జిల్లా యంత్రాంగంతో కలిసి చర్చించి పలు స్థలాలను పరిశీలించారు. కేంద్రీయ విద్యాలయ బృందం అన్ని వివరాలను పరిశీలించి స్థలాన్ని ఖరారు చేసి నిర్మాణాన్ని ప్రారంభించడానికి అవసరమైన అన్ని పత్రాలను సమర్పించాలని జిల్లా అధికారులను కోరారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



రెడ్డెప్ప (ఫైల్)

మదనపల్లె అర్బన్, మే 21 (ఆంధ్రజ్యోతి): కరెంట్ షాకుతో వ్యక్తి మృతి చెందిన సంఘటన పుంగనూరు మండలంలో చోటు చేసుకుంది. ఆస్పత్రి అవుట్ పోలీసుల తెలిపిన వివరాల మేరకు... పుంగనూరు మండలం, చంద్రమాకులపల్లెకు చెందిన కొండప్ప కుమారుడు రెడ్డెప్ప (55) చంద్రమాకులపల్లెలోని సచివాలయంలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నారు. బుధవారం సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగి మునగాకు పెరికి ఇవ్వాలని కోరడంతో సమీపంలోని చెట్టును ఎక్కి ఆకు కోస్తుండగా కరెంటు తీగ చెట్టు కొమ్మకు తగిలి షాక్‌కు గురయ్యాడు. వెంటనే స్థానికులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఇతనికి భార్య శోభ, ఇద్దరు కుమారులైలు ఉన్నారు. పుంగనూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈత.. తస్మాత్ జాగ్రత్త







● అప్రమత్తంగా లేకపోతే మృత్యువాత ● విషాదంగా మారుతున్న ఈత సరదా

కడప క్రైం/ వల్లూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): వేసవికాలం వచ్చిందంటే చాలు చిన్న పెద్ద మహిళలు అనే తేడా లేకుండా సరదాగా ఈత కొట్టాలని ఉవ్విళ్లూరుతుంటారు. స్విమ్మింగ్‌పూల్స్, చెరువులు, నీటి కుంటలు, వాగులు, వంకలు ఇలా ఎక్కడ నీళ్లు ఉంటే పరుగులు పెడుతుం టారు. అయితే ఆ సరదా మాటునే పెనుప్ర మాదం పొంచి ఉంటుందని ఊహించరు. ముఖ్యంగా తెలిసీ తెలియని పిల్లలు సరదాగా ఈత కోసం వాగులు, వంకలు, చెరువుల్లోకి వెళ్లి ప్రాణాలు కోల్పోతూ తల్లిదండ్రులకు గర్భకోశ మిగుల్చుతున్నారు. ఈ నేపథ్యంలో సరదాగా ఈత కోసం వెళ్లే వారు తప్పక నిపు ణులు సూచనలు, సలహాలు పాటించాల్సి ఉంది.

జిల్లాలో పెన్నానది, ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట, వాటర్‌గండి బ్రహ్మంసాగర్, గండికోట, మైలవరం, కుందూ, చెయ్యేరు, పాపాఘ్ని సోమశిల లాంటి ప్రాంతాల్లో తరచూ నీటి ప్రమాదాలు జరుగుతున్నాయి. అయితే పెన్నానదిలో పుష్పగిరి క్షేత్రం, సిద్దవటం తదితర ప్రాంతాల్లో సుడిగుండాలు ఉన్నాయి. ఇక్కడ నిరంతరం నీరు ఉండడంతో ఈత కొట్టేందుకు మక్కువ చూపిస్తుంటారు. బ్రహ్మంసాగర్ సమీపంలో పలు చెరువులున్నాయి. అయితే సరదా కోసం ఈతకు వెళ్లి ఆ నీటిలో చిక్కుకుని ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. పిల్లలు ఈత ఆడుతున్న సమయంలో పర్యవేక్షణ లేపోవడం, కొంత మంది పెద్దలు చెబితే మందలిస్తారని ఉద్దేశ్యంతో పిల్లలు ఎవరికీ చెప్పకుండా వెళ్లి ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. ఇటీవల బ్రహ్మం గారిమఠం సమీపంలోని మల్లేపల్లె చెరువు వద్ద ఐదుగురు పిల్లలు ఈత కోసం వెళ్లి మృత్యువాత పడ్డారు. అలాగే ఆదినిమ్మాయపల్లెడ్యాం వద్ద ఇతర రాష్ట్రాలకు చెందిన ఇరువురు నీటి మునిగి ఊపిరి వదిలారు. ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి.

తల్లిదండ్రుల నిఘా తప్పనిసరి

పిల్లల పట్ల తల్లిదండ్రులు బాధ్యతగా ఉంటూ వారిపై నిఘా ఉంచాలి. స్నేహితులతో కలిసి బయట ఆడుకుంటున్నారా, లేక ఎక్కడికైనా వెళుతున్నారా అని తరచూ గమనిస్తూ ఉండాలి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో తమకు సమీపంలో చెరువులు ఉంటే అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. పిల్లలను ఈత కోసం తీసుకెళ్లాల్సిన అవసరం వచ్చినప్పుడు పెద్దల పర్యవేక్షణలో వారు ఈత ఆడేలా చూడాలని నిపుణులు సూచిస్తున్నారు.

జాగ్రత్తలు పాటించాలి



కడప నగరానికి సమీపంలో ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట, పెన్నానది ఉండడంతో వేసవిలో ఇక్కడకు పర్యాటకులు ఎక్కువగా వస్తుంటారు. సరదా గా ఈతకు దిగే పిల్ల లు, పెద్దలు నదిలో దిగే టప్పుడు ముందుగా సూచిక బోర్డులను గమ నిస్తూ.. చుట్టుపక్కల వ్యక్తుల సలహాలు, సూచ నలు తీసుకోవాలి. పిల్లలకు పెద్దలు తోడుగా ఉం డి ఈత సరదా తీర్చాలి. లేదంటే విషాదాలకు దారి తీసే ప్రమాదం ఉంది.

- పెద్దఓబన్న, వల్లూరు ఎస్ఐ

ఈతకు దిగే ముందుగా...

నీటి ప్రవహం అధికంగా ఉన్న చోట ఈత కొట్ట రాదు. నడుం లోతు నీరు ఉండి ప్రవహం లేని చోట మాత్రమే ఈత నేర్చుకోవాలి. ఈత కొట్టే సమయంలో వర్షాలు వస్తే తక్షణమే బయ టికి రావాలి. నిపుణులైన శిక్షకుల వద్ద అన్ని సౌకర్యాలు ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో మాత్రమే ఈత నేర్చుకోవాలి. ఫిట్స్, గుండె జబ్బులు వంటి ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఈతకు దూరంగా ఉండాలి. పురాతనమైన బావుల్లో చెరువుల్లో కర్రలు, రాళ్లు ఉంటాయి. తొందరపడి ఈతకు దూకితే అవి పొడుచుకుని చనిపోయే ప్రమాదం ఉంది.

అంజన్నకు స్నపన తిరుమంజనం



ప్రత్యేక అలంకరణలో అంజన్న ఉత్సవ విగ్రహం

చక్రాయపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రలో జరిగే హనుమత్ జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అంజన్నకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. బుధవారం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో వేదపండితులచే హోమాలు గావించారు. త్రికాల ఆరాధన, చతురస్థానార్చన, మన్యసూక్తహోమం, పంచముఖ హనుమాన్ మూల మంత్ర హోమం, స్నపన తిరుమంజనం, లఘుపూర్ణాహంతి, గోష్టి నిర్వహించారు. సాయంత్రం త్రికాల ఆరాధన, పంచసూక్త హోమం, సింధూర అర్చన, లఘు పూర్ణాహతి, గోష్టి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. యజ్ఞాచార్యులు ధర్మగిరి వేదపాఠశాల అధ్యాపకులు రామాను జాచా ర్యులు, వారి శిష్య బృందం స్వామివారికి పూజ కార్యక్రమాలు జరిపించారు. జిల్లా సహాయ కమిషనర్ మల్లికార్జునప్రసాద్, దేవస్థాన చైర్మన్ కావలి కృష్ణతేజ, అర్చకులు కేసరి, రాజారమేష్, రాజగోపాలచార్యులు, రామ మోహన్‌శర్మ, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

గండి ఆలయ పనులను పరిశీలించిన ఆర్జేసీ



ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఆర్జేసీ చంద్రశేఖర్ ఆజాద్

గండి క్షేత్రంలో జరిగే ఆలయ పునర్నిర్మాణ పనులను బుధవారం దేవదాయ ధర్మాదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ పరిశీలించారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణఫలంతో స్వాగతం పలికి పూజలు చేశారు. అనంతరం ఆయన హనుమత్ జయంతి హోమాల్లో పాల్గొని హారతులు అందుకున్నారు. అనంతరం ఆలయ నిర్మాణ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

విజిలెన్స్ దాడుల్లో రేషన్ బియ్యం స్వాధీనం

దువ్వూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దజొన్నవరం గ్రామంలో బుధవారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి ఓ ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రాబడిన సమాచారం మేరకు విజిలెన్స్ డీసీటీవో ఖాజాహుస్సేన్, హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ, కానిస్టేబుల్ టిప్పుసుల్తాన్, నవిల్‌సపై డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జున దాడులు జరిపారు. దువ్వూరుకు చెందిన కొండా శేఖర్ అనే వ్యక్తి గ్రామంలోని ఒక ఇంటిలో అక్రమంగా దాచి ఉంచిన 1728 కిలోలు చౌక దుకాణాలకు సంబంధించిన బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు గ్రామ వీఆర్వో సౌజన్య సమక్షంలో పంచనామా నిర్వహించారు. బియ్యం విలువ రూ.79,542లుగా ఉంటుందని అంచనా వేశారు. పట్టుబడిన బియ్యంను స్థానిక చౌకదుకాణంలో స్వాధీనపరిచారు. అనంతరం బేపారి శేఖర్‌ను అదుపులోకి తీసుకుని స్థానిక పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. ఈ విషయాన్ని ఎస్ఐ వినోద్‌కుమార్ ధ్రువీకరించారు.

హత్యాయత్నం కేసులో వైసీపీ నేతల అరెస్టు



అరెస్టు చేసిన నిందితులను చూపుతున్న పోలీసులు

ముద్దనూరు మే 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి చిన్నదుద్యాల గ్రామంలో బీజేపీ నేతలపై దాడికి పాల్పడిన వైసీపీ నేతలను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ దస్తగిరి వివరాల మేరకు... చిన్నదుద్యాల గ్రామంలో మంగళవారం తాగునీటి బోరు మరమ్మతుల విషయంలో బీజేపీ నేతలు వెంకటేశ్వర్లరెడ్డి, శ్రీనివాసులరెడ్డిపై వైసీపీ నేతలు గ్రామ సర్పంచ్ భర్త మదన్‌మోహనరెడ్డి, లక్ష్మిరెడ్డి, ప్రసాద్‌రెడ్డిలు కత్తులతో దాడి చేసి గాయపరిచారు. అప్పటి నుంచి పరారీలో ఉన్నారు. బుధవారం నిందితులు ముద్దనూరు-జమ్మలమడుగు రోడ్డులోని శివాలయం సమీపంలో ఉండగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

భర్త అత్తమామలపై గృహహింస కేసు

పులివెందుల, మే 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజారెడ్డికాలనీకి చెందిన గంగాదేవి అనే మహిళ తన భర్త, అత్తమామలు వేధిస్తున్నారని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా... రాజారెడ్డి కాలనీకి చెందిన గంగాదేవిని వేంపల్లెలోని రాజీవ్ నగర్ కాలనీకి చెందిన సుబ్బమ్మ, వెంకటేష్ కుమారుడైన రమణకు ఇచ్చి వివాహం చేశా రు. రమణ, గంగాదేవిలకు ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. రమణ ఇటీవల వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని గంగాదేవిని వేధిస్తున్నా డు. భర్తతో పాటు అత్తమామలు కూడా వేధిస్తుండడంతో భరించలేక తన పుట్టింటికి వచ్చింది. ఈ మేరకు బాధితురాలు బుధవారం పులివెందుల అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై గృహహింస చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చాంద్‌బాషా తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

వల్లూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొప్పోలి బస్టాండు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. మండల పరిధిలోని కుమారునిపల్లె వద్ద ఇటుకల బట్టీ లో పనిచేస్తున్న కూలీలు తిండి తినడానికి వల్లూరు బస్టాండు వైపు నడుచుకుంటూ వెళుతుండగా కొప్పోలి బస్టాండు దాటగానే వల్లూరు వైపు వెళు తున్న ద్విచక్ర వాహనం వారికి తగలడంతో చరణ్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. అలాగే ద్విచక్ర వాహనదారుడికి కూడా తీవ్రగాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడిన వారిని 108 వాహనం ద్వారా కడప రిమ్స్‌కు తరలించారు.

రేపటి నుంచి ఏటీఎస్ ద్వారా ఫిట్‌నెస్ పరీక్షలు

సీకేదిన్నె, మే 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నూతనంగా ఏర్పాటైన ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్ (ఏటీఎస్) ద్వారా ఈ నెల 23వ తేదీ శుక్రవారం నుంచి వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఉపరవాణా కమిషనర్ ప్రసాద్ తెలిపారు. పెండ్లిమర్రి మండలం తిప్పిరెడ్డిపల్లె గ్రామంలో ఈ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వాహనదారులు వారి ఫిట్‌నెస్ పరీక్షలకు ఈ కేంద్రం ద్వారా పొందాలని తెలిపారు. ఇకపై ఆర్టీవో కార్యాలయం దగ్గర మ్యాన్యువల్ ఫిట్‌నెస్ పరీక్షలు జరగవని, వాహనదారులు ఈ విషయం గమనించి రవాణా శాఖకు సహకరించాలని కోరారు.

20 లక్షల మొక్కల పెంపకం లక్ష్యం : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టరు శ్రీధర్ చెరుకూరి

కడప ఎన్జీఆర్ సర్కిల్, మే 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పచ్చదనాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో జిల్లా వ్యాప్తంగా 20 లక్షలు మొక్కలు నాటాలని కలెక్టరు శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని బోర్డు రూం హాలులో డీఎఫ్‌వో వినీత్‌కుమార్‌తో కలిసి జిల్లా కలెక్టరు మొక్కల పెంపకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రెండు దశల్లో జూన్ 27న పది లక్షల మొక్కలు, ఆగస్టు 29 తేదీ పది లక్షల మొక్కల పెంపకాన్ని చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేసేందుకు తగు కార్యాచరణతో ముందుకు సాగాలన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో లక్ష్యానికి చేరువగా అడుగులు వేయాలన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ప్రతి ఇంటికీ పండ్ల మొక్కలు పంపిణీ చేయాలని సూచించారు. ప్రకృతి సమతుల్యత పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. సామాజిక అటవీ విభాగం వారు మొక్కలు పంపిణీ చేయాలన్నారు. వివిధ సంస్థల కార్యాలయాల్లో, చెరువు గట్లు, ప్రభుత్వ భూములు వంటి అనుకూల ప్రాంతాల్లో మొక్కలను విరివిగా నాటేందుకు సర్వే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారిణి రాజ్యలక్ష్మి, జడ్పీ సీఈవో ఓబులమ్మ, జిల్లా పర్యాటక శాఖ అధికారి సురేశ్, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలి : ఆర్జేడీ



విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలను అందజేస్తున్న పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్

కడప ఎడ్యుకేషన్, మే 21 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులకు అందజేస్తున్న ప్రత్యేక ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని జోన్-4 పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్ సూచించారు. బుధవారం సమగ్ర శిక్ష కార్యాలయ ఆవరణలో ఉపకరణాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అలింకో ఉపకరణాలను తయారుచేసి అందిస్తోందన్నారు. వీటిని సమగ్ర శిక్ష ఆధ్వ ర్యంలో అర్హులను గుర్తించి అందజేయడం జరుగుతుందన్నారు. ఈ ఉపకరణాలను సద్వినియోగం అయ్యేలా వారి తల్లిదండ్రులు, ప్రత్యేక ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ నిత్యానందరాజు, విభిన్న ప్రతిభాంతులశాఖ జిల్లా సంచాలకులు కృష్ణ కిషోర్ మాట్లాడుతూ ఉపకరణాలు దివ్యాంగులు తమ లోపాలను అధిగమించి పురోగమించడానికి అవకాశం కల్పిస్తాయన్నారు. కార్యక్రమంలో ఆర్జేడీ కార్యాలయ ఏడీ విజయకుమార్, సమగ్ర కోఆర్డినేటర్ రమణమూర్తి, కేశవరెడ్డి, విశ్వనాథరెడ్డి, వీరేంద్ర, ఐఈఆర్పీలు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థికి షైనింగ్ స్టార్ అవార్డు



విద్యార్థి విష్ణుశ్‌కు అవార్డు అందజేస్తున్న మంత్రి లోకేశ్

కాశినాయన మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సాపురం ఏపీ మోడల్ స్కూల్‌లో 2024-25 విద్యా సంవత్సరంలో 10 వ తరగతి చదివిన విద్యార్థి బి.విష్ణుశ్ షైనింగ్ స్టార్ అవార్డు అందుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ సౌజన్య తెలిపారు. రాష్ట్రంలో ఏపీ మోడల్ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థుల్లో విష్ణుశ్ 600కు 593 మార్కులు సాధించి ప్రథమస్థానంలో నిలిచాడన్నారు. ఈమేరకు 20వ తేదీ మంగళవారం విజయవాడలోని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ క్యాంపు కార్యాలయంలో ఆయన చేతుల మీదుగా తల్లిదండ్రులతో కలిసి విద్యార్థి అవార్డు అందుకున్నారు.

క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేయాలి

● డిప్యూటీ డీఎంహెచ్ఓ ఖాజామొహిద్దీన్

పులివెందుల రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ)ల పరిధిలో ఉన్న క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేయాలని పులివెందుల డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాజా మొహిద్దీన్ సూచించారు. స్థానిక డిప్యూటీ డీఎంహెచ్ఓ కార్యాలయంలో బాకరాపురం యూపీహెచ్‌సీ డాక్టర్ శాంతి కుమార్, నగరిగుట్ట యూపీహెచ్‌సీ డాక్టర్ స్నేహ ప్రత్యూష, మలేరియా సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్యలతో కలిసి సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా డాక్టర్ ఖాజా మొహిద్దీన్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు పడుతున్నాయని, నీటి నిల్వలు ఉండే అవకాశం ఎక్కువగా ఉంటుం దన్నారు. ఆరోగ్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు అందరు జాగ్ర త్తగా ఉండి ఫీవర్ సర్వేలు, లార్వా సర్వేలు నిర్వహించి జ్వరాలను గుర్తించాల్సి ఉంటుందన్నారు. జ్వరాలు ఉన్నట్ల యితే స్థానిక ఆసుపత్రికి వెళ్లేలా చూడాలన్నారు. అలాగే పరిసరాలు శుభ్రంగా ఉంచుకునేలా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఈ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించేలా క్షేత్ర స్థాయి సిబ్బందికి సూచించాలని తెలిపారు.

వడ్డీభారం లేకుండా క్రాప్‌లోన్స్ రెన్యువల్ చేయాలి : ఎంపీ



పులివెందులలో ఎస్‌బీఐ మేనేజర్‌తో మాట్లాడుతున్న ఎంపీ

పులివెందుల, మే 21 (ఆంధ్రజ్యోతి): రైతులపై వడ్డీభారం లేకుండా పంట రుణాలను రెన్యువల్ చేయాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి బ్యాంకు అధికారులను కోరారు. బుధవారం పట్టణంలోని ఎస్‌బీఐ మేనేజర్‌తో, ఆర్ఎంలతో ఎంపీ మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గత ఏడాది రైతుల క్రాప్‌లోన్స్ రెన్యువల్స్ సమయలో రైతులతో డబ్బులు కట్టించుకొని రైతులకు రెన్యువల్ చేయకుండా బ్యాంకు అధికారుల తప్పిదంతో వదిలేశా రన్నారు. ఇపుడు రైతులపై అధిక వడ్డీ భారం పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పులివెందుల బ్యాంకు మేనేజర్‌తో అన్నారు. అనంతరం ఎస్‌బీఐ కడప రీజనల్ మేనేజర్‌తో అక్కడి నుంచే ఫోన్ చేసి మాట్లాడుతూ రైతులపై ఒక్కరూపాయి భారం పడకుండా క్రాప్‌లోన్స్ రెన్యువల్ చేయాలని సూచించారు. అలాగే రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్, ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం రుణాలు పెంచి ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట రైతులు ఉన్నారు.

పెండింగ్ కేసులను త్వరిత గతిన పూర్తి చేయాలి : ఆర్డీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రమోహన్

బద్వేలు, మే 21 (ఆంధ్రజ్యోతి): బద్వేలు రెవెన్యూ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులపై విచారణ జరిపి త్వరిత గతిన పూర్తిచేయాలని ఆర్డీవో చంద్రమోహన్ పోలీసులకు సూచించారు. బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో డివిజన్‌స్థాయి ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ పరిధిలో 20 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని.. త్వరితగతిన విచారణ చేపట్టి పూర్తి చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన కేసులపై పోలీసు అధికారులు నిర్లక్ష్యం వహించకుండా బాధితులకు సత్వరమే న్యాయం అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీఐ రాజగోపాల్, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

విశాఖ ఉక్కును కాపాడుకుందాం

కడప నాగరాజుపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ కోసం 1559 రోజుల నుంచి చేస్తున్న రిలే నిరాహార దీక్షకు కాంగ్రెస్ పార్టీ మద్దతు పలికింది. బుధవారం కడప జిల్లా డీసీసీ అధ్యక్షురాలు విజయ జ్యోతి, కడప డీసీసీ జనరల్ సెక్రటరీ సయ్యద్ గౌస్‌పీర్, కార్యకర్తలు వెళ్లి సంఘీభావంగా కూర్చొన్నారు. కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అంటూ నినాదాలు చేశారు.

రూ.80 కోట్లతో కడప అభివృద్ధికి బాటలు

సీఎంలు, డిప్యూటీ సీఎంలు ఉన్నా తాగునీటికి శాశ్వత పరిష్కారం శూన్యం ● మినీ మహానాడులో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే మాధవి, చిత్రంలో పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, హరిప్రసాద్, గోవర్దన్‌రెడ్డి, కుసుమకుమారి, దుర్గాప్రసాద్ తదితరులు, మాట్లాడుతున్న టీడీపీ ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

కడప ఎర్రముక్కపల్లె, మే 21 (ఆంధ్రజ్యోతి):టీడీపీ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రూ.80 కోట్లతో కడప అభివృద్ధికి బాటలు వేసినట్లు ఎమ్మెల్సీ జోనల్ కో-ఆర్డినేటర్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర పేర్కొన్నారు. గత ప్రభుత్వాల్లో జిల్లాకు చెందిన ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు ఉన్నప్పటికీ తాగునీటి శాశ్వత పరిష్కారం శూన్యమని ఎద్దేవా చేశారు. బుధవారం కడప నగరం రాజరాజేశ్వరి కళ్యాణ మండపంలో కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి అధ్యక్షతన మినీ మహానాడు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీద రవిచంద్ర మాట్లాడుతూ కడప నగరంలో శాశ్వత తాగునీటి పరిష్కారానికి రూ.500కోట్లతో ప్రాజెక్టును రూపొందించడం జరిగిందన్నారు. మేజర్ డ్రైనేజీల నిర్మాణం కోసం మరో రూ.60కోట్లు నిదులు విడుదల కానున్నాయన్నారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ టీడీపీ విజయంలో రాయలసీమ ప్రత్యేక భూమిక పోషించిందన్నారు. రాయలసీమ జిల్లాల్లోని 52 నియోజకవర్గాలలో 42 నియోజక వర్గాలు టీడీపీ కైవసం చేసుకుందన్నారు. కడపలో మహానాడు నిర్వహించడానికి ఇదో ప్రత్యేక కారణమన్నారు. రాష్ట్రమంతా కడప వైపు చూసేలా చేస్తామని ప్రధానంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పసుపు పండుగను ప్రత్యేకం గా చూడాలన్నారు. కడప నగరాన్ని క్లీన్ కడపతో పాటు అభివృద్ధి చేయాలన్నదే ప్రధాన లక్ష్యమన్నారు. కడప నగరంలో ప్రధాన సమస్యలైన డ్రైనేజీ, షహమీర్యా బ్రిడ్జి నిర్మాణాలను ఆరు నెలల్లో పూర్తిచేస్తామన్నారు. ప్రస్తుతం బుగ్గవంకను ఎంతో సుందరంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఒక పత్రిక పనిగట్టుకొని బురద జల్లే కార్యక్రమం చేస్తుందన్నారు. గత వైసీపీ పాలనలో కార్పొరేషన్ ను విధ్వంసం చేశారన్నారు. గత నాలుగు సంవత్స రాలలో జరిగిన ప్రతి అవినీతిని బయటపెడతామన్నారు. యువత భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకొని పది ఎకరాల్లో ఐటీపార్క్ నిర్మాణం చేస్తున్నట్లు చెప్పారు. అలాగే పి-4 బిల్డింగ్ నిర్మాణం చేసి రూ.10కోట్లతో స్టార్టప్ సంస్థను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కడప నియోజకవర్గ అబ్జర్వర్ పత్తిపాటి కుసుమకుమారి మాట్లాడుతూ నియోజక వర్గంలో ఉన్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళుతానన్నారు. ఎమ్మెల్యే, సభాధ్యక్షురాలు మాధవిరెడ్డి మాట్లాడుతూ కడప నియోజకవర్గంలో కొత్తశకం ప్రారంభమైందన్నారు. కడప నియోజక వర్గంలో టీడీపీ కార్యకర్తలు గర్వంగా తలెత్తుకొని తిరిగేలా చేస్తామని చెప్పారు. అనంతరం కడప నియోజకవర్గానికి సంబంధించి పలు తీర్మానాలను ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శులు ఎస్.గోవర్దన్‌రెడ్డి, బి.హరి ప్రసాద్,రాష్ట్ర నాయకుడు దుర్గాప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ, యాదగిరి, రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాపై బురద చల్లి లబ్ధి పొందాలనుకోవడం అవివేకం

టీడీపీ సీనియర్ నాయకుడు లక్ష్మీరెడ్డి



కడప మారుతీనగర్, మే 21 (ఆంధ్రజ్యోతి) : మాపై బురద చల్లి లబ్ధి పొందాలనే ఆలోచనలను టీడీపీ కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి ఆమె భర్త టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి మానుకోవాలని, అసలు ఆ ఆలోచన అవివేకమని టీడీపీ సీనియర్ నాయకుడు జి.లక్ష్మీరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1996 నుంచి ఇప్పటి వరకు టీడీపీ అభ్యున్నతి కోసం అంకితభావంతో సేవలందిస్తున్నామన్నారు. మూడు దశాబ్దాలుగా అన్ని ఎలక్షన్‌లలోనూ అలంఖాన్‌పల్లెలో టీడీపీని విజయపథాన నడిపించామన్నారు. ప్రస్తుతం కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి లేనిపోని అపోహలు, గందరగోళం సృష్టిస్తోందన్నారు. తన వ్యక్తిగత ప్రతిష్టను దిగజార్చేలా ఇటీవల మినీ మహానాడు కార్యక్రమంలో నకిలీ ఆడియో, వీడియో సృష్టించి తాను వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేశానని టీడీపీ కార్యకర్తలకు వినిపించడం సరైంది కాదన్నారు. టీడీపీ మహానాడు పండుగకు అందరినీ కలుపుకుని ముందుకు వెళ్లాల్సిన వారు కొంతమందిని అప్రతిష్టపాలు చేయాలనుకోవడం బాధాకరమన్నారు. ఎవరు కాదన్నా, అవునన్నా టీడీపీ కోసం కష్టపడి పనిచేస్తామన్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా వెనకడుగు వేసే ప్రసక్తేలేదన్నారు. పార్టీపండుగ మహానాడును ఒక గొప్ప పండుగలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో 49వ డివిజను టీడీపీ కార్పొరేటరు ఉమాదేవి పాల్గొన్నారు.

బాలికల కోసం కిశోరి వికాసం

కడప ఎన్టీఆర్ సర్కిల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : బాలికల కోసం కిశోరి వికాస కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఐసీడీఎస్ సీడీపీవో శోభారాణి అన్నారు. నగరంలోని అశోక్‌నగర్, చిన్నచౌకు, కడప అంగన్వాడీ కేంద్రాల్లో బుధవారం కిశోర వికాసం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీడీపీవో మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా బాలికలకు విద్య, నైపుణ్యం, ఎదుగుదల, పోటీతత్వం, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజరు మాబుచాన్, వన్‌స్టాప్ సెంటరు అశ్విని, ఏఎన్ఎంలు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాలు

సీకేదిన్నె, మే 21 (ఆంధ్రజ్యోతి): సబ్సిడీ ద్వారా పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు ఏవో ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలాని 50 శాతం సబ్సిడీతో 50 క్వింటాళ్ల పచ్చిరొట్ట జనుములు మంజూరు చేయడం జరిగిందన్నారు. 10 కిలోల బస్తా ధర రూ.1090 కాగా ప్రభుత్వ సబ్సిడీ 50 శాతం పోను రూ.545 రైతులు చెల్లించి వారి పేర్లను గురువారం నుంచి నమోదు చేసుకోవచ్చన్నారు. ఇందుకోసం రైతు పట్టాదారు పాస్‌బుక్కు, ఆధార్‌కార్డు, మొబైల్ తప్పనిసరిగా తెచ్చుకోవాలన్నారు. ఒక ఎకరాకు 10 కిలోలు ఇవ్వడం జరుగుతుందని, అయిదు ఎకరాలకు 50 కేజీలు విత్తనాలు ఇవ్వడం జరుగుతుందన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

కమలాపురం రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : నగర పంచాయతీ పరిధిలోని శ్రీసాయి హాస్పిటల్ నందు గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొద్దుటూరుకు చెందిన మమత హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఈ వైద్యశిబిరం ఉంటుందన్నారు. ఈ వైద్యశిబిరంలో స్త్రీ వ్యాధులు, కాన్పులు సంతాన సాఫల్యం డాక్టర్ కె.జయసత్య వైద్యశిబిరానికి వచ్చే మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించనున్నారు. తెల్లబట్ట, గర్భసంచి, గడ్డలు, రొమ్ములో గడ్డలు, పేగు జారడం, నెలసరి సమయంలో సమస్యలపై వైద్యపరీక్షలు నిర్వహిస్తారన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

ఉపాధి హామీలో

అవినీతిపై విచారణ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రమాదేవి

లింగాల, మే 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అవినీతి పెరిగియిందని వెంటనే విచారణ చేసి చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. లింగాల మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ రమాదేవి అధ్యక్షతన ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఉపాధి హామీ పథకంలో సిబ్బంది కొంతమంది కూలీలతో కలిసి అవినీతికి పాల్పడుతున్నారని సభ్యులు ఆరోపించారు. రోజు పనికి రాకపోయినా హాజరైనట్లు మస్టర్లలో నమోదు చేస్తూ వచ్చే డబ్బులలో చెరీ సగం అంటూ కూలీలతో ఒప్పందం చేసుకొని అవినీతికి పాల్పడుతున్నారని, వెంటనే విచారణ చేసి చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఉపాధి పథకంలో జరుగుతున్న అవినీతిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంపీడీఓకు కో-ఆప్షన్ సభ్యుడు రసూల్ వినతిపత్రం అందించారు. తహసీల్దార్ ఈశ్వరయ్య మాట్లాడుతూ కొత్తగా రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేవారికి, వివాహాలు జరిగి కార్డులో పేర్లు జత చేసుకోవాలన్నా ఇప్పటి వరకు వివాహ ధ్రువీకరణ పత్రం అడిగేవారని దీనితో సమస్యలు ఉత్పన్నం అవుతుండడంతో తాజాగా ప్రభుత్వం వివాహ ధ్రువీకరణ పత్రం లేకపోయినా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొందని వెల్లడించారు.

ఉద్యోగుల సంక్షేమంపై లోకేశ్ ప్రత్యేక దృష్టి: టీడీపీ

వేంపల్లె, మే 21 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సంక్షేమంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేకించి ఐటీశాఖ మంత్రి నారాలోకేశ్ ప్రత్యేక దృష్టితో కృషిచేస్తున్నారని టీడీపీ మండల కన్వీనర్ మునిరెడ్డి తెలిపారు. వేంపల్లెలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ గతంలో వైసీపీ ప్రభుత్వంలో సమస్య అడగాలన్నా భయపడే వాతావరణం ఉండేదన్నారు. ఏ సమస్యను అడిగిన ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేసేవారని తెలిపారు. కూటమి ప్రభుత్వ హయాంలో సమస్యలను అడిగే వాతావరణాన్ని కల్పించిందన్నారు. వేమకుమార్, మడక శ్రీనివాసులు, డక్కా రమేష్, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌చట్ట సవరణ ఉపసంహరించే వరకు ఉద్యమం

కడప మారుతీనగర్, మే 21 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని నరేంద్రమోదీ ముస్లింమైనార్టీల మనోభావాలు దెబ్బతినేలా తెరపైకి తీసుకువచ్చిన వక్ఫ్ చట్ట సవరణలు ఉపసంహరించుకునే వరకు ఉద్యమం ఆగదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్ఏ సత్తార్ అన్నారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావే శంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మాజీ నాయకులు నజీర్ అహ్మద్, నాయకులుఆసిఫ్‌ఖాన్, అక్రం, నగర అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్, కో-ఆర్డినేటరు బండి జకరయ్య పాల్గొన్నారు.

జూదరులు అరెస్టు



వాహనాల తనిఖీలో సీఐ చాంద్‌బాష, సిబ్బంది

పులివెందుల, మే 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నగరిగుట్టలో జూదమాడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ చాంద్‌బాష తెలిపారు. బుధవారం సాయంత్రం నగరిగుట్టలో జూదమాడుతున్న ముగ్గురిని అరెస్టు చేశామన్నారు. వీరి నుంచి రూ.2820 స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై కేసు నమోదు చేశామన్నారు.

వాహనాల తనిఖీలో రూ.4020 జరిమానా: పులివెందుల పట్టణంలో బుధవారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టామని సీఐ చాంద్‌బాష తెలిపారు. ఈ వాహనాల తనిఖీలో 12 వాహనాలకు సంబంధించి సరైన పత్రాలు చూపకపోవడంతో రూ.4020 జరిమానా విధించామన్నారు. ఆయా వాహనదారులు జరిమానా కట్టి వాహనాలను తీసుకెళ్లారన్నారు.

నేడు హనుమజ్జయంతి వేడుకలు

పులివెందులటౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని తూర్పు ఆంజనేయస్వామి గుడి, పడమటి ఆంజనేయస్వామి, కడప రోడ్డులోని ఆర్ఆర్ లేఅవుట్‌లో వెలసిన అంజ నేయస్వామి గుడి వద్ద కోతి సమాధి ఆంజనేయస్వామి ఆలయం, నూతన ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న ఆంజనేయస్వామి దేవాలయాల్లో హనుమాన్ జయంతి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం ఆంజనేయస్వామి జయంతి సందర్భంగా ఆలయాలను ముస్తాబు చేశారు. అన్నదాన కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం భారీ ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వల్లూరు..: నేడు హనుమాన్ జయంతి సందర్భంగా మండల పరిధిలోని గోటూరు, వల్లూరు, కుమారునిపల్లె, పెద్దపుత్త తదితర గ్రామాల్లో ఉండే ఆంజనేయస్వామి దేవాలయాల్లో ఉత్సవాలకు కార్యనిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. గోటూరువద్ద బండలాగుడు పోటీలు ఉంటాయని, కార్యనిర్వాహకులు తెలిపారు. పాల్గొనే ఎద్దుల యజమానులు ఉదయం 7గంటల లోపు దేవస్థానం వద్దకు వచ్చి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

చెన్నూరు..: హనుమజ్జయంతిని గురువారం చెన్నూరులో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. మండలంలోని అన్ని ఆంజనేయస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

వీరపునాయునిపల్లె..: మండల పరిధిలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో గురువారం హనుమత్‌జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణలు గావించనున్నారు. మండలంలోని ఎన్.పాలగిరి, సంగాలపల్లె తదితర గ్రామాల్లోని ఆంజనేయస్వామికి భక్తులు పూజలు జరగనున్నాయ. స్వామివారికి పలు గ్రామాల్లో ఉత్సవమూర్తిని ట్రాక్టర్‌లో గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మురుగునీటిలో అరుంధతీనగర్

చెన్నూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గ్రామ పంచాయతీలోని అరుంధతీనగర్‌లో మురుగునీకు తాండవిస్తోంది. బుధవారం సాయంత్రం కురిసిన వర్షంతో అరుంధతీనగర్‌లోని అన్ని వార్డులు మురుగునీటి నిండిపోయాయి. నీరంతా వెళ్లేందుకు ఎలాంటి అవకాశం లేకపోగా ఆ నీరు ఇళ్లల్లోకి చేరి ఆ ప్రాంతవాసులను ఇబ్బంది పెడుతోంది. గతంలో వేసిన చిన్నపాటి మురుగుకాల్వలో వర్షం నీటితో పలు రకాల వ్యర్థాలు పేరుకుపోవడంతో ఆ నీరు కాల్వల గుండా ప్రవహించే అవకాశం లేకుండాపోయింది. పైగా వీధులన్నీ హైవేకి తగ్గ ప్రాంతం కావడంతో వర్షం కురిసిందంటే ఆ నీరంతా రోజులకొద్దీ అరుంధతీనగర్‌లో నిలిచి పక్కనే ఉన్న మురుగు కాల్వల నీటితో కలిసి దారుణ మైన దుర్వాసన వెదజల్లడం, దీంతో దోమలు పెరగడం, ప్రజలు రోగాలబారిన పడడం సర్వసాధారణమైంది. కనీసం వీధుల్లో వేసిన రోడ్లు తగ్గప్రాంతం ఉన్నాయి కాబట్టి వర్షంనీరు నిలిచి ఎక్కడకీ వెళ్లేందుకు దారి లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు.



అరుంధతీనగర్‌లో మురుగునీటితో కలిసి వర్షం నీరు

'అధైర్యపడొద్దు'

పులివెందుల, మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కూటమి పాల్పడుతున్న కక్షసాధింపు చర్యలకు దిగుతోందని ఎవరూ అధైర్యపడొద్దు అండగా ఉంటామని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని వైసీపీ క్యాంప్ కార్యాలయంలో ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. పలువురు వారి వారి సమస్యలు చెప్పుకొన్నారు. పార్టీలకతీతంగా ప్రజలకు న్యాయం చేయాలని ఎంపీ అధికారులకు సూచించారు.

ప్రశాంతతను కలిగించేదే భాగవత సప్తాహం

పులివెందుల, మే 21 (ఆంధ్రజ్యోతి): ఆధునిక మానవుడికి ప్రశాంతతను కలిగించేదే భాగవత సప్తాహం అని ఏపీసీసీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. బుధవారం తొండూరు మండలంలోని అగడూరు గ్రామంలోని శ్రీకోదండ రామస్వామి దేవాలయంలో జరిగిన భాగవత సప్తాహంలో తులసిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగవతులు బాలకృష్ణారెడ్డి, చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఉత్తన్న, నాగరాజు, వినయ్ పాల్గొన్నారు.

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శికి సత్కారం

కడప ఎర్రముక్కపల్లె, మే 21 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రాజరాజేశ్వరి కళ్యాణమండపంలో బుధవారం జరిగిన మినీ మహానాడు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ బీద రవిచంద్రను టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ మర్యాదపూర్వకంగా ఆయనకు పూలబొకే అందజేసి శాలువ కప్పి సత్కరించారు.



బీద రవిచంద్రను సత్కరిస్తున్న టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ

ప్రజా సంక్షేమం, అభివృద్ధే టీడీపీ లక్ష్యం

మినీ మహానాడులో తీర్మానాలు..

- సోమశిల వెనుకజలాల నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా అట్లూరు, గోపవరం మండలాల్లోని 33 చెరువులను నింపుతూ బద్వేల్ పెద్ద చెరువుకు నీరు అందించడం.
- అవధూత కాశినాయన ఆలయ అభివృద్ధి
- అట్లూరుకు బాకరాపేట నుంచి బద్వేల్ ఫారెస్టు గేటు ఎత్తివేయడం, బాకరాపేట నుంచి తాటిచెర్ల మోటు వరకు నేషనల్ హైవేగా రోడ్డును పునరుద్ధరించడం.
- తెలుగు గంగ బ్రహ్మసాగర్ నుంచి బద్వేలు నియోజకవర్గంలోని అన్ని చెరువులకు నీరు అందించడం, పెద్ద, పిల్ల కాల్వలను పూర్తిచేసి ఆయకట్టుకు నీరు అందించడం.
- బద్వేల్ నియోజకవర్గానికి పరిశ్రమలు తెచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించడం.
- ప్రముఖ పుణ్యక్షేత్రమైన లంకమల ఆలయ అభివృద్ధి, ఫారెస్టు టూరిజం చేపట్టాలి.
- పోరుమామిళ్ల పంచాయతీని మున్సిపాలిటీగా చేయడం.
- కలసపాడు మండలానికి వెలుగొండ నుంచి నీరు ఇవ్వాలి.
- కాశినాయన మండలంలో కోల్డ్‌స్టోరేజీ నిర్వహించి, హార్టికల్చర్ పంటలకు ఉపయోగపడేలా చూడాలి.
- బ్రహ్మంసాగర్ నుంచి బద్వేల్ నియోజకవర్గం ఎల్ఎస్‌పీ ప్రాజెక్టుకు, చెరువులకు నీరు అందించడానికి శాశ్వత జీవో ఏర్పాటు చేయాలి.

● బద్వేల్ అంటే అతిథ్యానికి మారుపేరు ● మహానాడును జయప్రదం చేయండి ● టీడీపీ నేతలు




మినీ మహానాడులో మాట్లాడుతున్న రితేష్‌కుమార్‌రెడ్డి.. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నాగేంద్ర తదితరులు.. హాజరైన నాయకులు, కార్యకర్తలు

బద్వేల్ టౌన్, మే 21(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం, అభివృద్ధే టీడీపీ లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజకవర్గ పరిశీలకుడు దుగ్గల నాగేంద్ర, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం బద్వేల్ పట్టణంలోని ఆర్ఆర్ కళ్యాణమండపంలో మినీ మహానాడు కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్, బిజివేముల వీరారెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచస్థాయిలో తక్కువ కాలంలో అధికారంలోకి వచ్చి టీడీపీ ఘనకీర్తి పొందిందని, టీడీపీ హయాంలోనే పేద, బడుగు, బలహీన వర్గాలకు అనేక సంస్కరణలు వచ్చాయన్నారు. పార్టీ కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. టీడీపీకి పునాది, బలం, శక్తి కార్యకర్తలేనని చంద్రబాబు నాయకత్వంలో సమగ్రాభివృద్ధి, పేదల అభ్యున్నతితో పాటు కార్యకర్తల సంక్షేమానికి కూడా టీడీపీ పెద్దపీట వేస్తోందన్నారు. ఈనెల 27, 28, 29వ తేదీల్లో కడపలో జరిగే మహానాడు కార్యక్రమం టీడీపీ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందని, మొదటిసారి కడప జిల్లాలో నిర్వహించే ఈ మహానాడు ఉత్సవంగా నిర్వహించేలా కలిసికట్టుగా నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. టీడీపీలో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికి పదవులు ఇచ్చి సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. బద్వేలు నియోజకవర్గాన్ని టీడీపీ కంచుకోటగా మార్చేవిధంగా ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా మండలాల్లోని సమస్యలను, చేసిన తీర్మానాలను మహానాడులో ప్రస్తావిస్తామన్నారు. వీటిలో ప్రధానంగా సాగు, తాగునీటి సమస్యలతో పాటు రోడ్డు సౌకర్యం, అర్హులైన పేదలకు భూపంపిణీ, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై విచారణ, వంటి పలు తీర్మానాలపై మహానాడులో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, ఎల్ఎస్‌పీ డ్యామ్ చైర్మన్ రమణారెడ్డి, కూటమి అభ్యర్థి బొజ్జ రోశన్న, పట్టణ అధ్యక్షుడు వెంగలరెడ్డి, రాగిమాను ప్రతాప్‌కుమార్, రంతు, రవి, భైరవ ప్రసాద్, బిగ్‌బాస్, మల్లికార్జునరెడ్డి, ఎనమల సుధాకర్, సీతా వెంకటసుబ్బయ్య, మస్తాన్ బాబు, అరవ శ్రీనివాసులరెడ్డి, రైస్‌మిల్లు ప్రసాద్, వెంకటసుబ్బయ్య, రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నూతన భవనంలోకి తహసీల్దార్ కార్యాలయం

కొండాపురం, మే 21 (ఆంధ్రజ్యోతి): కొండాపురం తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం నూతన కార్యాలయంలోకి మార్చారు. పాత తహసీల్దార్ కార్యాలయం గండికోట ప్రాజెక్టు క్రింద ముంపునకు గురికావడంతో ఇంతవరకు నూతన భవన నిర్మాణాన్ని చేపట్టలేదు. అప్పటినుంచి తాత్కాలికంగా పాత ఊరిలోనే ఒక అద్దె భవనంలో కొనసాగించారు. దీంతో కార్యాలయానికి వెళ్లాలంటే ప్రజలు ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం కొండాపురం గ్రామమంతా హైవే పక్కనే కొత్తగా నిర్మితమైంది. కొత్త ఊరిలో అదనంగా ఉన్న సచివాలయం భవనంలోకి తహసీల్దార్ కార్యాలయాన్ని మార్చారు. ఈ సందర్భంగా కూటమి మండల ఇన్‌చార్జి శివనారాయణరెడ్డి ఆధ్వర్యంలో పూజాకార్యక్రమాలు చేసి ప్రారంభించారు. తహసీల్దార్ గురప్ప, ఎంపీడీవో నాగప్రసాద్, ఆర్ఐ మహేశ్వరరెడ్డి, కూటమి నాయకుడు శంకర్‌రెడ్డి, టీచర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ భూముల కౌలు రూ.22లక్షలు

పెద్దముడియం, మే 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దపసుపుల గ్రామంలో వెలసిన మాధవ, ఆంజనేయస్వామి, ఈశ్వర, వీరభద్ర దేవాలయాలకు సంబంధించిన భూముల కౌలు రూ.22లక్షలు వచ్చింది. బుధవారం దేవదాయశాఖాధికారి విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో ఈ భూములకు వేలంపాట జరిగింది. ఈ దేవాలయాలకు సంబంధించి సుమారు 200 ఎకరాల భూములకు నిర్వహించిన కౌలు వేలంపాటలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం కౌలు నగదును రైతుల వద్ద నుండి స్వీకరించి అధికారులు రశీదులు ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రతి ఏడాది కౌలు రూపంలో లక్షలాది రూపాయలు ఆదాయం తీసుకునిపోతున్నారే తప్ప ఆలయ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఈవో దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఆలయాన్ని పునర్నిర్మించేందుకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపాలని కోరారు. కాగా పురోహితుల భూములకు కౌలు వేలం నిర్వహించలేదు.

నీటి సమస్య తలెత్తకుండా చూడాలి

మైలవరం, మే 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నీటి సమస్య లేకుండా చూడాలని ఎంపీడీవో రామచంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ సావిత్రి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో, ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాలను ప్రతి ఒక్కరు పరిశుభ్రంగా ఉంచుకునేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. పండ్ల తోటల పెంపకానికి అర్హులైన రైతుల నుంచి దరఖాస్తు తీసుకోవాలన్నారు. రేషన్‌కార్డులకు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు లక్ష్మీనారాయణ, ఇరిగేషన్ ఏఈ సుబ్బారావు, వెలుగు ఏపీఎం వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో నగదు రహిత లావాదేవీలు

ప్రొద్దుటూరు రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పౌరసేవలు సులభతరం చేసేలా డిజిటల్ పేమెంట్లకు శ్రీకారం చుట్టినట్లు మండల విస్తరణాధికారి రామాంజనేయులరెడ్డి, కొత్తపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో నగదు రహిత లావాదేవీలను చేపట్టే కార్యక్రమంలో భాగంగా ఇంటి పన్ను, కుళాయి పన్ను, తదితర పన్నులను ప్రజలు ఆన్‌లైన్ ద్వారా డిజిటల్ పేమెంట్ల రూపంలో చెల్లించేందుకు నూతనంగా స్వర్ణ గ్రామ పంచాయతీని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ వెబ్‌సైట్‌లో లేదా క్యూఆర్ కోడ్ ద్వారా పన్నులను చెల్లించడంతో పాటు వాట్సాప్ గవర్నెన్స్ అవకాశాన్ని కల్పించారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు మార్కెట్ కాంప్లెక్స్ గదుల అద్దెపై అభిప్రాయ సేకరణ

ప్రొద్దుటూరు , మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం శివాలయం సర్కిల్‌లోని మున్సిపల్ కూరగాయల మార్కెట్ కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ గదులను గుడ్‌విల్ పద్ధతిపై అద్దెకు ఇచ్చుటపై శుక్రవారం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 11గంటలకు మున్సిపల్ కార్యాయలంలోని కౌన్సిల్ హాల్లో జరుగుతుందని, కావున పట్టణంలోని వ్యాపార సంఘాలకు చెందిన పెద్దలతో పాటు మార్కెట్ అసోసియేషన్, కిరాణా దుకాణాల అసోషియేషన్, గోల్డ్ షరాబు వ్యాపారుల సంఘం, క్లాత్ మర్చంట్ అసోషియేషన్ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలు తెలపాలని ఆ ప్రకటనలో కోరారు.

గీతాశ్రమం గదుల వేలం వాయిదా

ప్రొద్దుటూరు టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ గీతాశ్రమంలో గదుల వేలంపాటను వాయిదా వేసినట్లు ఈవో రామచంద్రాచార్యులు తెలిపారు. గీతాశ్రమంలోని 8 గదులను బుధవారం వేలంపాట నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. అయితే దేవాదాయశాఖ నుండి పర్యవేక్షణ అధికారి రాకపోవడంతో ఈ వేలంపాటను వాయిదా వేశారు. పది రోజుల తర్వాత వేలంపాట నిర్వహిస్తామని ఈవో తెలిపారు.

పారదర్శకంగా నిర్వహించాలి

ఈ వేలంపాటను పారదర్శకంగా నిర్వహించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. గతంలో ఉన్న ఈవోలు తమకు నచ్చినవారికి తక్కువ బాడుగకు కేటాయించి దేవదాయ శాఖకు నష్టం చేకూర్చారన్నారు. దేవాదాయ శాఖకు వ్యతిరేకంగా కోర్టుకు వెళ్లినవారికి గదులను అప్పగించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఇప్పటికైనా లోపాయికారి ఒప్పందాలను పక్కనపెట్టి సక్రమంగా వేలంపాట నిర్వహించాలని కోరారు.

రామాలయ అభివృద్ధికి రూ.1.10లక్షలు విరాళం

పోరుమామిళ్ల, మే 21 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్లలో మూలవీధిలో వెలసిన రామాలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే స్వామి శివరామానందసరస్వతి, ఆయన కుటుంబ సభ్యులు శ్రీనివాస్‌కుమార్, హరితమ్మ రూ.1.10లక్షల విరాళం అందించారు. దేవాలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరు కావాలని బుధవారం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన ఈ విరాళం అందించారు. అలాగే బుధవారం నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న సర్పంచ్ యనమల సుధాకర్ ఆలయ అభివృద్ధికి రూ.50వేల విరాళం అందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాళ్లపల్లె రవికుమార్, దేవస్థాన కమిటీ సభ్యులు తమ్మిశెట్టి రఘురామయ్య, లక్ష్మణ్‌రావు, నీటిసంఘం అధ్యక్షుడు తోట వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందిస్తున్న స్వామి శివరామానంద సరస్వతి

పత్తూరులో చర్చి ప్రారంభం

ఖాజీపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని పత్తూరు దళితవాడలో నూతనంగా నిర్మించిన చర్చిని గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, టీడీపీ నాయకులు మిల్లు శ్రీను, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్థులు కలిసికట్టుగా చర్చిని నిర్మించుకోవడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పుల్లయ్యనాయుడు, దుంపలగట్టు రవి, ఇండ్ల సుబ్బారెడ్డి, సుబ్బయ్య, జానకీరాం, రామసుబ్బయ్య, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

25 మంది పేకాటరాయుళ్లు అరెస్టు

● రూ. 1.70 లక్షలు నగదు స్వాధీనం

ప్రొద్దుటూరు, మే 21(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం లింగాపురం గ్రామం ఎరుకల కాలనీలో పేకాట ఆడుతున్న 25 మందిని బుధవారం రూరల్ ఎస్ఐ అరుణ్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టుకున్నారు. వీరి వద్ద నుండి రూ.1.70 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వీరంతా ఓ వివాహ కార్యక్రమానికి వచ్చి పేకాట ఆడినట్లు వెల్లడించారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఉన్న కొన్ని కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదని, అటువంటి విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు ఉపవిద్యాశాఖాధికారి మీనాక్షికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రగతిశీల విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు, ఎన్‌డీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్, పీఎఫ్‌వైఎఫ్ జిల్లా కన్వీనర్ బయన్న మాట్లాడుతూ ప్లాన్ అప్రూవల్ లేకుండా ఇష్టం వచ్చినట్లు భవనాలను నిర్మించుకుని అపార్టుమెంట్లలో పాఠశాలలను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. కొన్ని పాఠశాలలు పాఠశాలలోనే వసతి గృహాలను నిర్వహిస్తున్నారని, అలాగే పాఠ్యపుస్తకాలు, ఇతర విద్యాసామగ్రి నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాలల్లోనే విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు.



డిప్యూటీ డీఈవో మీనాక్షికి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

మోడల్ డీఎస్సీ పరీక్షను జయప్రదం చేయండి

జమ్మలమడుగు, మే 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఈనెల 28వ తేదీన డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించే మోడల్ డీఎస్సీ పరీక్షను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు ప్రసాద్ తెలిపారు. బుధవారం జమ్మలమడుగు ఎస్టీవో హోమ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. జమ్మలమడుగులో మోడల్ డీఎస్సీ పరీక్ష నిర్వహిస్తున్నామని, డీఎస్సీ రాసే అభ్యర్థులకు ఈ పరీక్ష ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

నేడు తిరంగా ర్యాలీ

దువ్వూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులో గురువారం హనుమత్ జయంతిని పురస్కరించుకుని 300 బైక్‌లతో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకులు హరికృష్ణ, రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. పార్టీలకు, కులమతాలకు అతీతంగా ఈ ర్యాలీని విజయవంతం చేయాలని వారు కోరారు.

తహసీల్దారు బదిలీ

ఖాజీపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): ఖాజీపేట తహసీల్దారు మహబూబ్‌బాష కడప కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. ఈ క్రమంలో ఖాజీపేట ఇన్‌చార్జి తహసీల్దారుగా కమలాపురం తహసీల్దారు శివరాంరెడ్డిని నియమించినట్లు తహసీల్దార్ మహబూబ్ బాషా తెలిపారు.

డీటీ సాయినాథ్‌రెడ్డికి తహసీల్దారుగా పదోన్నతి

ప్రొద్దుటూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు డిప్యూటీ తహసీల్దారుగా వున్న వెంకట సాయినాథ్‌రెడ్డికి తహసీల్దారుగా పదోన్నతి లభించింది. ఈయనను సింహాద్రిపురం తహసీల్దారుగా నియమిస్తూ కలెక్టర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

బసవేశ్వర ఆలయానికి పూజా సామగ్రి అందజేత

ముద్దనూరు, మే 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధి బొందలకుంట బసవేశ్వరస్వామి ఆలయానికి బుధవారం బసవేశ్వర సాయి ఆశ్రమం వారు రూ.40వేలు విలువ చేసే పూజా సామగ్రి అందజేసినట్లు ఆలయ అర్చకుడు అనిల్ తెలిపారు. రెండు అఖండ దీపాలు, గుడి గంట అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమం సభ్యుడు నాగరాజు పాల్గొన్నారు.

షర్మిల దీక్షకు మద్దతు

ప్రొద్దుటూరు టౌన్, మే 21(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులకు అండగా డీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విశాఖపట్నంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షకు కాంగ్రెస్ పార్టీ ప్రొద్దుటూరు నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇర్ఫాన్‌బాషా మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసి ప్రైవేటుపరం చేయడానికి కుట్ర పన్నుతోందన్నారు. పరిశ్రమను నిర్వీర్యం చేయడానికి ఉద్యోగులను తొలగిస్తున్నా కూటమి ప్రభుత్వం ప్రశ్నించకుండా చోద్యం చూస్తోందని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ

కలసపాడు, మే 21(ఆంధ్రజ్యోతి): కలసపాడులో బుధవారం అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమ భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం యంత్ర ప్రతిష్ఠ, శిఖర కలశ ప్రతిష్ఠ, ధ్వజప్రతిష్ఠ, శిఖర కలశ కుంభాభిషేకం, సీతారాముల శాంతి కల్యాణం తదతర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం బండలాగుడు పోటీలు ఏర్పాటు చేసి బహుమతులు గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. తరలివచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

బలరామిరెడ్డి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ పరామర్శ



సినీనటుడు రాజ్‌కుమార్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

కొండాపురం, మే 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన మాజీ జడ్పీ చైర్మన్ సీఎం బలరామిరెడ్డి కుటుంబసభ్యులను ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి బుధవారం రాత్రి పరామర్శించారు. బలరామిరెడ్డి అల్లుడు, సినీ నటుడు రాజ్‌కుమార్, కుటుంబసభ్యులను బుధవారం ఆయన కొండాపురంలో కలిశారు. బలరామిరెడ్డితో తనకు సాన్నిహిత్య సంబంధాలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. కార్యక్రమంలో గిరిధర్‌రెడ్డి, ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.